క్లుప్తంగా

నేడు చింతదిబ్బలో గుడాల గోపి ప్రచారం

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శుక్రవారం మధ్యాహ్నం నుంచి మండలంలోని చింతదిబ్బ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని వివరించారు. డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, మొగల్తూరు ప్రాంతాల ప్రయాణికులు 99592 25486కు ఫోన్ చేసి సమస్యలను తెలపాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.11,49,478 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లురావు తెలిపారు. గురువారం పండిత విల్లూరు కేవీవీ బ్రహ్మారెడ్డి పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. 136 రోజులకు గానూ ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా నిత్యాన్నదాన నిమిత్తం రూ.14,302 ఆదాయం వచ్చినట్లు వివరించారు. లెక్కింపులో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నూలి వెంకట సత్య కోటేశ్వర గుప్తా, సభ్యులు నూలి పవన్ నాగేంద్ర గుప్తా, ఆను నాగేశ్వరరావు, రామోజు అమ్మన రాజు, నందం నాగలక్ష్మీ, జక్కంశెట్టి లక్ష్మి, కందికట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు


నాడు బీఆర్‌ఎంవీ హైస్కూల్ ఆవరణ


నేడు బీఆర్‌ఎంవీ హైస్కూల్ ఆవరణ


నాడు ఎస్‌కేపీ టీవీఆర్ హైస్కూల్


నేడు ఎస్‌కేపీ టీవీఆర్ హైస్కూల్

నాడు అధ్వానం-నేడు అమోఘం

- నాడు నేడు పథకంలో మారిన పాఠశాలల రూపురేఖలు
- కార్పొరేట్ స్థాయి హంగులతో ప్రభుత్వ పాఠశాలలు

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే ప్రజలకు ఓ చిన్నచూపు ఉండేది. ముఖ్యంగా అక్కడి సౌకర్యాలపై అసహనంతో కష్టమైనా తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేవారు. ఇదంతా 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు మాట. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక తీసుకొచ్చిన నాడు-నేడు పథకం పాఠశాలల రూపురేఖలను మార్చింది. అప్పట్లో అధ్వానంగా ఉండే పాఠశాలలకు నేడు అమోఘం అనేంతలా మార్చి చూపించారు. అధునాతన వసతులతో పాటు నాణ్యమైన విద్యను పేదలకు అందించాలనే తపనతో సీఎం జగన్ తీసుకొచ్చిన నాడు-నేడు పథకం పేద విద్యార్థులకు వరంగా మారింది.

– పాలకొల్లు సెంట్రల్




నాడు బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాల


నేడు బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాల


నాడు సుభాష్‌చంద్రబోస్ హైస్కూల్ దుస్థితి


అధునాతన వసతులతో నేడు సుభాష్‌చంద్రబోస్ హైస్కూల్


నాడు ఎంఎంకెఎస్‌ఎం హైస్కూల్


నేడు ఎంఎంకేఎస్‌ఎం హైస్కూల్


నాడు పాఠశాలల్లో విద్యార్థులు కూర్చునే బల్లలు


నేడు పాఠశాలల్లో విద్యార్థులు కూర్చునే బల్లలు

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి


రిటర్నింగ్ అధికారి స్వామి నాయుడు

పెనుగొండ: ఎన్నికల నిర్వహణలో జవాబుదారీతనం ఉండేలా నియోజకవర్గంలో అన్ని విభాగాలను అప్రమత్తం చేసినట్లు ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు. గురువారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దీని కోసం ఎన్ కోర్ మేనేజ్‌మెంట్, సీ-విజిల్, తనిఖీలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రచారానికైనా అనుమతులు తప్పనిసరన్నారు. ఏ ఒక్కరూ రూ.50 వేలు మించి నగదును దగ్గర ఉంచుకోరాదన్నారు. పెద్ద మొత్తంలో నగదు ఉంటే తగిన ఆధారాలు తనిఖీ అధికారులకు చూపాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకూ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం రూ.3,46,100, పోలీస్ డిపార్ట్‌మెంట్ రూ.1,51,900 స్వాదీనం చేసుకోగా, 2.25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రచారం కోసం వచ్చే అభ్యర్థనలను 48 గంటలలో మార్గదర్శకాలకు అనుగుణంగా సింగిల్ విండో విధానం ద్వారా జారీ చేస్తామని, అసంపూర్తిగా ఉన్న వాటిని తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీ అనుమతుల కోసం అవసరమైన పత్రాలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఇప్పటివరకూ 22 అభ్యర్థనలు రాగా, 21కి అనుమతులు జారీ చేశామన్నారు. ఒక దరఖాస్తును తిరస్కరించినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 24 గంటలూ కాల్ సెంటర్ అందుబాటులో ఉంటుందని, సమస్యల పరిష్కారానికి 08814-297299 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింటు కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేటు వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్‌లో వేసవి కాలం సందర్భంగా చలివేంద్రాలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ రానున్న మూడు నెలలో జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం


మొగల్తూరు: మహిళకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ప్రసాదరాజు


పాలకొల్లు సెంట్రల్: గుడాల శ్రీహరిగోపాలరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

మొగల్తూరు: ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మొగల్తూరు గ్రామంలోని నెంబర్-1 పాఠశాల ఏరియా, వేగివారిపేట, దయాల్‌దాస్‌పేట, చిన్న గొల్లగూడెం, పాతకాలు, కొండావారిపాలెం, గోడావారిపాలెం, కాసానావారిపే, పడమటిపాలెం ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పర్యటించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ మీ కుటుంబానికి మంచి జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటెయ్యాలని అభ్యర్థించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ప్రసాదరాజు నెంబర్-1 పాఠశాల సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేగివారిపేటలోని మహిళలు తమ ప్రాంతంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రసాదరాజు తనయుడు శ్రీ కృష్ణంరాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు వేండ్ర వెంకటస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఎన్నాబత్తుల ఉషారాణి, నాయకులు కర్రి ఏసుబాబు, గుబ్బల నారాయణ మూర్తి, కుక్కల కృష్ణ మోహన్, కొల్లాబత్తుల రవికుమార్, దొంగ నాగముని, కవురు సుబ్రమణ్యం,బొడ్డుపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) గడప గడపకూ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. గురువారం గ్రామంలో గుడాల గోపితో పాటు ఆయన భార్య, కుమారుడు గుడాల మంగతాయారు, గుడాల సాయి బాలాజీలు ముగ్గురు మూడు వైపులా గ్రామంలో ప్రచారం చేపట్టారు. తనను ఆశీర్వదించండి నేను కొందరు నాయకుల్లా డ్రామాలాడలేను, యాక్షన్‌లు చేయలేను కాని నియోజకవర్గ పేద బడుగు బలహీన వర్గాలకు అవసరమైన అన్ని సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని గోపి వివరించారు. కార్యక్రమంలో యడ్ల తాతాజీ, నడపన గోవిందరాజులు, విప్పర్తి ప్రభాకర్, పితాని చిన్న, రావాడ సతీష్, కవురు రాంపండు, విన్స్‌టన్‌బాబు, మద్దా చంద్రకళ, కర్రా జయసరిత, పోతాబత్తుల సత్యనారాయణ, అల్లు శ్రీనివాసరావు, గూడురి త్రిమూర్తులు, యాండ్ర ప్రసాద్, మిడతాని సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


మునమర్రులో పట్టాబి రామయ్య విగ్రహ ప్రతిష్ఠలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దంపతులు

పెనుగొండ: మునమర్రులో పట్టాభిరామయ్య నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నూతన విగ్రహాలకు పూజలు, అభిషేకాలు, వాస్తు, శాంతి హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గురువారం ఉదయం నుంచి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైజయంతి దంపతులు, మరి కొందరు దంపతుల పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట వెంకట సత్యనాగరత్నం మెహర్ దంపతులు, ధర్నాల సూర్యారావు, బొబ్బిలి రాముడు, ఏడిద రాంబాబు, ఏడిద పార్థసారధి పాల్గొన్నారు.

కొడమంచిలి జక్కంశెట్టివారిపాలెంలో

కొడమంచిలి జక్కంశెట్టివారిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయం విగ్రహం ప్రతిష్ఠ మహోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ ఏరియాల్లో రామాలయాల పర్యవేక్షణ చాలా బాధ్యతగా నిర్వహిస్తారని కొనియాడారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మన్నె సుబ్బారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటపటిమతో ఉండాలి


తూర్పుపాలెంలో గురుప్రసాద్‌తోకలసి కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రతి కార్యకర్త పోరాటపటిమతో ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. చింతపల్లి గురుప్రసాద్ బహుజన కులాల కోసం 45 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేస్తూ, వైఎస్సార్ సీపీలో సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురుప్రసాద్ అభిమానులు తూర్పుపాలెంలో గురువారం గురుప్రసాద్‌తో శ్రీరంగనాథరాజు సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట నియోజక వర్గ వలంటీరు కన్వీనర్ కర్రి అనురాధ జోగిరెడ్డి, రాష్ట్ర ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ బొక్క అరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంపన బోయిన బాబూరావు, జిల్లా కార్యదర్శి కాకిలేటి బాపిరాజు, పెనుగొండ మండల ఎస్సీ సెల్ కన్వీనరు పలివెల శ్రీను, ఏఎంసీ డైరెక్టరు కుసుమే రాంబాబు, దిద్దే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

భీమవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామంలో జిల్లా సరిహద్దులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టును జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రూ. 50,000 నగదు నుంచి తీసుకెళ్లవద్దని, ఒకవేళ అవసరాల రీత్యా తీసుకెళ్తే ఆ నగదుకు సంబంధిత ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలు అధికారులకు చూపించాలన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ వాహనాల తనిఖీల సమయంలో చెక్‌పోస్ట్ వద్ద ఉన్న పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ సత్య కిషోర్, ఎస్సై జి రాజు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంఘ అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంభాస్కరరావు

మొగల్తూరు: సంఘ అభివృద్ధికి సభ్యులు సహకరించాలని సొసైటీ చైర్మన్ మోటుపల్లి రాంభాస్కరరావు కోరారు. గురువారం మొగల్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి రూ.1.07 కోట్లతో అంచాన బడ్జెట్‌ను ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. అంచనా వ్యయం రూ.89 లక్షలు కాగా, నికర లాభం రూ.18.19 లక్షలుగా ప్రతిపాదించారు. గత ధాన్యం సీజన్‌లో రైతులకు రావాల్సిన రూ.3.32 కోట్లు రైతుల ఖాతాలో జమయ్యాయన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బొడ్డుపల్లి సుబ్బారావు, నేతల రత్నంరాజు, సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ

ఉండి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్ రవీంద్ర అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్‌ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో తాగునీటి సరఫరాపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఇతర అధికారులు మాట్లాడుతూ గత వేసవి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామ శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాపై స్థానికులతో మాట్లాడి చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కొత్తగా పైపులైన్ విస్తరణ చేసిన ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటిని తప్పకుండా సరఫరా చేయాలని, అది మన బాధ్యత అని అన్నారు. అలాగే ప్రతి గ్రామంలోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపుకోవాలని సూచించారు. కాలువలు కట్టే సమయానికి పూర్తిస్థాయిలో నీటి మట్టాలతో వేసవిని తట్టుకునేలా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఈవోపీఆర్‌డీ ఎం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం రూరల్ సీఐ వై సత్య కిషోర్

పాలకోడేరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్, ఎస్సై నాలం శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు గురువారం పాలకోడేరులోని రైతు భరోసా కేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అల్లరి చిల్లరి పనులు చేసి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. ఎటువంటి గొడవలూ జరగకుండా చూసి పాలకోడేరు మండలానికి మంచిపేరు తీసుకు రావాలని ఎస్సై కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణం నాయుడు, వీఆర్వోలు గ్రామస్తులు పాల్గొన్నారు.